నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 3 జనవరి 2025 | VIKARABAD

శంకర్‌పల్లిలో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్న ఇస్తెమా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యేవారికి వసతులు కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డీఎంహెచ్‌వో నిర్వాహకులకు సూచించారు.
- చేవెళ్ల రూరల్, జనవరి 2



మాజీ మంత్రి కేటీఆర్‌కు గురువారం చేవెళ్ల మండల పరిధి తంగడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు శేఖర్, శంకర్, సాయికుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- చేవెళ్ల రూరల్, జనవరి 2

పాత బిల్లులు ఆపి.. కొత్త పనులా..?

- గతేడాదిగా బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు
- బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు
- పెండింగ్‌లో రూ.10 కోట్ల చెల్లింపులు
- 'మన ఊరు-మన బడి'లో 20 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు
- మన ఊరు-మన బడి స్థానంలో 'అమ్మ ఆదర్శ పాఠశాల'
- ఎంపిక చేసిన బడుల్లో కాకుండా కొత్త స్కూళ్లలో పనులు ప్రారంభం
- కక్ష సాధింపులకు పాల్పడుతున్న సర్కారుపై సర్వత్రా విమర్శలు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద పూర్తయిన పనులకు సంబంధించి చెల్లింపులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాదైనా కాంట్రాక్టర్లకు నిధులను ఇంకా విడుదల చేయకపోవడం గమనార్హం. గతేడాదిగా జిల్లా విద్యాశాఖ అధికారులు కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ నిధుల విడుదలలో నిర్లక్ష్యం వహిస్తున్నది. స్కూల్ కమిటీలు, సంబంధిత అధికారుల ఒత్తిడితో పలు స్కూళ్లలో పనులు పూర్తి చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తి చేసిన వారిలో చాలావరకు స్కూల్ కమిటీ సభ్యులే ఉండడం, వారు అప్పులు చేసి పనులు పూర్తి చేసినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులకు సంబంధించి బిల్లులు చేసి ప్రభుత్వానికి అందజేసినప్పటికీ సర్కారు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు సైతం సంబంధిత బిల్లుల విషయంలో త్వరలో నిధులు విడుదల అవుతాయని కాంట్రాక్టర్లకు చెప్తూ చేతులెత్తేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 371 స్కూళ్లను మన ఊరు-మన బడిలో భాగంగా ఎంపిక చేయగా, 20 స్కూళ్లలో పనులు పూర్తికాగా స్కూళ్లను కూడా గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 300 స్కూళ్లలో పనులు 20-50 శాతం మేర పనులు పూర్తయ్యాయి. సంబంధిత పనులకు సంబంధించి రూ.10 కోట్ల చెల్లింపులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నది.

- వికారాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ)

20 ప్రభుత్వ స్కూళ్లలో మారిన రూపురేఖలు

ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులను తీసుకువచ్చేందుకుగాను బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమంతో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. సర్కారు స్కూళ్లలో సకల వసతులు కల్పించడంతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి. మొదటి విడతలో ఎంపిక చేసిన స్కూళ్లలో మండలానికి, మున్సిపాలిటీకి రెండు చొప్పున జిల్లాలో 20 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి సంబంధిత స్కూళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి పనులు పూర్తి చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, విద్యుత్తు, గ్రీన్ చాక్‌బోర్డులు, పెయింటింగ్, ప్రహరీ నిర్మాణం, కిచెన్ షెడ్‌ల నిర్మాణం, శిథిలమైన తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు, డిజిటల్ విద్యకు అవసరమైన ఏర్పాట్లు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్లను సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లోకి అందుబాటులోకి తీసుకువచ్చారు. జిల్లావ్యాప్తంగా 1054 ప్రభుత్వ పాఠశాలలుండగా వీటిలో మొదటి విడతలో 371 స్కూళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకుగాను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. మొదటి విడతలో ఎంపిక చేసిన స్కూళ్లలో ఉన్నత పాఠశాలలు-111, ప్రాథమికోన్నత పాఠశాలలు-40, ప్రాథమిక పాఠశాలలు-220 పాఠశాలలున్నాయి.

మన ఊరు-మన బడి స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మన ఊరు-మన బడి స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. మన ఊరు-మన బడిలో భాగంగా ఎంపిక చేసిన 20 శాతం పనులు పూర్తైన స్కూళ్లు కాకుండా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో కొత్త స్కూళ్లను ఎంపిక చేసి పనులు చేస్తున్నారు. 'మన ఊరు-మన బడి'లో ఇప్పటికే కొంతమేర పనులు పూర్తైన స్కూళ్లలోనే పనులు చేపట్టాలనే అభిప్రాయం వ్యక్తమైనా కాంగ్రెస్ సర్కారు సంబంధిత స్కూళ్లను పట్టించుకోకపోవడం గమనార్హం. మన ఊరు-మన బడి కార్యక్రమంలో పనులు ప్రారంభించిన స్కూళ్లలో చేయకుండా కొత్త స్కూళ్లలో పనులు చేస్తూ రేవంత్ సర్కారు కక్ష సాధింపు చర్యలు చేస్తుండడంపై సర్వత్రా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

నివ్వెరపోయా..

ఎంతో కష్టపడి టెట్ పరీక్షలకు ప్రిపేరయ్యాను. ఈసారి ఎలాగైనా పరీక్షలో ఎక్కువ మార్కు తెచ్చుకొని డీఎస్సీ రాద్దామనుకున్న. కాని పరీక్షా సెంటర్ హన్మకొండలో ఉండడంతో నివ్వెరపోయాను. ఇప్పుడు ఏమి చేయాలో తెలియక, చదువుపై కూడా ధ్యాస పెట్టలేకపోతున్నా. నా పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది.

- కె.ప్రభావతి, టెట్ అభ్యర్థి, రొంపల్లి, బంట్వారం మండలం

టెట్ టెన్షన్

- వికారాబాద్ జిల్లావాసులకు హన్మకొండలో సెంటర్
- ఆందోళనలో అభ్యర్థులు
- సమీప కేంద్రాల్లో ఏర్పాటు చేయాలంటూ వినతి

బంట్వారం, జనవరి 2 : నిరుద్యోగుల పాలిట 'టెట్' పరీక్ష ఓ అగ్నిపరీక్షలా మారింది. ఇందుకు ప్రధాన కారణం పరీక్షా కేంద్రాలను సుదూర ప్రాంతాల్లో కేటాయించడం. వికారాబాద్ జిల్లా వాసులకు ప్రభుత్వం హన్మకొండలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీంతో అంత దూరం(సుమారు 400 కిలోమీటర్లు) ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. పరీక్షకు హాజరు కావాలంటే ఒక రోజు ముందు వెళ్లాల్సి వస్తుందని.. తిరిగి వెళ్లడానికి పరీక్ష మరుసటి రోజు రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మూడు రోజులకుగాను ఖర్చులు తడిసి మోపెడవుతాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల్లో సెంటర్లు కేటాయించడంతో పరీక్షలకు హాజరు కాలేమని కొందరు వాపోతున్నారు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వం నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తూ ఆటలాడుకుంటున్నదని మండిపడుతున్నారు.

సీబీటీ వల్లే ఈ ఇబ్బందులు..

టెట్ నిర్వహణ గతంలో ఓఎంఆర్ పద్ధతిలో ఉండేది. దీంతో జిల్లాలో ఎన్ని అవసరమంటే అన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి, అభ్యర్థులకు సౌకర్యవంతంగా ఉండేల చర్యలు తీసుకునేవారు. దీంతో పరీక్షలు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేవారమని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కంప్యూటర్ బేస్‌డ్ టెస్ట్(సీబీటీ)ని ఏర్పాటు చేయడంతో ప్రైవేట్ కంప్యూటర్ సెంటర్లపై ప్రభుత్వం ఆధారపడి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. అభ్యర్థులకు అవసరమైన కంప్యూటర్లు ప్రభుత్వం వద్ద లేకపోడంతో ప్రైవేటు సెంటర్‌లపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురించిందని అభ్యర్థులు వాపోతున్నారు.

డీలా పడిపోయా..

టెట్ రాసి ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని పట్టుదలతో చదువుకున్నా. తీరా సెంటర్ చూసి డీలా పడిపోయా. ఏమి చేయాలో అర్థం కావడంలేదు. 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న హన్మకొండకు వెళ్లి పరీక్ష రాసేలా లేను. ప్రభుత్వం సెంటర్‌ను హైదారాబాద్‌కు మారిస్తే పరీక్ష రాస్తా.

- టి.యాదమ్మ, టెట్ అభ్యర్థి, వికారాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి మాస్కులు ధరించి ర్యాలీ చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

డిమాండ్ల సాధన కోసం శాంతియుత మహా ర్యాలీ

సమగ్ర శిక్షా ఉద్యోగులకు బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ మద్దతు

వికారాబాద్, జనవరి 2 : సమగ్ర శిక్షా ఉద్యోగులందరికీ న్యాయం జరిగేవరకు సమ్మె కొనసాగుతుందని వికారాబాద్ జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేతావత్ గాంగ్యానాయక్ తెలిపారు. గురువారం వికారాబాద్‌లో ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించి బీజేఆర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి మాస్కులు ధరించి, బైఠాయించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె 28వ రోజుకు చేరింది. వీరికి బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ మద్దతు తెలిపారు. వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్రకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా సమగ్ర శిక్షాను విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. సమ్మెలో జిల్లాలోని 540 మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు భారీ స్థాయిలో పాల్గొన్నారు. వీరికి మద్దతుగా ఎంఆర్పీ, సీఆర్పీ, పాఠశాల, కేజీబీవీ, యూఆర్ఎస్, మోడల్ స్కూల్, డీపీవో స్థాయిలో అన్ని విభాగాల ఉద్యోగులు సమగ్ర శిక్షా ఉద్యోగులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలన్నారు. మోడల్ స్కూల్‌లో సమగ్రశిక్షాకు అనుబంధంగా పనిచేస్తున్న ఉద్యోగులను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు ప్రభావతి, డీపీవో శేఖర్, మెసెంజర్ అధ్యక్షుడు శ్రీశైలం, పీటీఐ అధ్యక్షుడు రవికుమార్, ఆయా మండలాల కేజీబీవీ పాఠశాలల ఎస్‌వోలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ఎస్సీ, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం

వికారాబాద్, జనవరి 2 : జిల్లాలో కొత్త మెనూ ప్రకారం, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో ఎస్సీ, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వంట సామగ్రి ఏర్పాటు, వంటకు ఉపయోగించే సరుకులు, కూరగాయలన్నింటిలో నాణ్యత పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శాఖలవారీగా రేట్ చార్ట్ ప్రకారం కొత్త మెనూను పాటించాలని అధికారులకు ఆదేశించారు. హాస్టళ్లలో మైనర్ రిపైర్స్ పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.

కుక్కల బెడద నివారణకు ఆపరేషన్లు

జిల్లాలో కుక్కల బెడదను నివారించడానికి జిల్లాలోని 4 మున్సిపాలిటీలలో 4 ఏబీసీ సెంటర్లను నెలకొల్పి స్థానిక పశువైద్యులతో కుక్కల జనన నియంత్రణ ఆపరేషన్లు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు సుమారు 700 కుక్కలకు వరకు ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎస్సీ అభివృద్ధి అధికారి మల్లేశం, బీసీ అధికారి ఉపేందర్, గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్‌రెడ్డి, మైనార్టీ అధికారి హనుమంతరావు పాల్గొన్నారు.

అధ్వానస్థితిలో సర్కారు దవాఖానలు

- రోగులకు మందులూ ఇవ్వలేని దుస్థితి
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- ఉచిత వైద్య శిబిరం ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



వైద్య శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఉప్పల వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్, జనవరి 2 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ దవాఖానలు అధ్వానస్థితికి చేరాయని.. రోగులకు మందులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నాయని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం మండలంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్-రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్-గంప లక్ష్మయ్యగుప్తా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో కామినేని దవాఖాన వైద్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఉప్పల ట్రస్ట్ అధినేత వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తాతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేసీఆర్ వైద్య రంగానికి పెద్దపీట వేశారని కొనియాడారు. హైదరాబాద్‌కు నాలుగు దిక్కులా నాలుగు అత్యాధునిక దవాఖానలను నిర్మించేందుకు చర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు పల్లె దవాఖానలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కాగా, రేవంత్ సర్కారు తీసుకుంటున్న చర్యలతో సర్కారు దవాఖానలు అధ్వానస్థితికి చేరాయని మండిపడ్డారు. సమస్యలపై ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నదన్నారు. గురుకులాల్లో పర్యవేక్షణ లోపించిందని, ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం అందించినప్పుడే ప్రజలు అభివృద్ధి సాధిస్తారన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో పై రెండు రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుతో ప్రజలతోపాటు ఉద్యోగులూ ఆందోళనలు చేపడుతున్నారన్నారు. ఈ శిబిరంలో 652 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు వైద్యులు అఖిల్, అనిల్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీసాయిచంద్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, మాజీ ఎంపీపీ నిర్మల, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల, గ్రామాధ్యక్షులు పరమేశ్, రామకృష్ణ, రైతు సమన్వయ సమితి నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి నివాళి

మండలంలోని మైసిగండి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విస్లావత్ హర్యానాయక్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మరణించారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గురువారం మధ్యాహ్నం మైసిగండి గ్రామానికి చేరుకొని, హర్యానాయక్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించినవారిలో ఎంపీ మల్లు రవి, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, వెంకటేశ్ తదితరులున్నారు

సరికొత్త ఆశయాలతో ముందుకు సాగాలి

విద్యార్థుల కోసం బ్లాంకెట్స్, నోటుపుస్తకాలు కలెక్టర్ నారాయణరెడ్డికి అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు తదితరులు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, జనవరి 2 (నమస్తే తెలంగాణ)/అబ్దుల్లాపూర్‌మెట్ : అధికారులు కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలతో ముందుకు సాగి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందంజలో నిలపాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నూతన సంవత్సరం సందర్భంగా మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి శాఖ పని తీరును మెరుగుపర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. కాగా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్, మండల పంచాయతీ అధికారుల అసోసియేషన్ సహకారంతో హాస్టళ్లలోని విద్యార్థుల కోసం 200 బ్లాంకెట్స్, 100 నోట్ పుస్తకాలను కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, జిల్లా అధికారులు, రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రాజేశ్, శశిధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ఆదిబట్ల : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయం సనత్‌నగర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చొద్దు' అంశంపై రూపొందించిన పోస్టర్లను రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను కాల్చడంద్వారా ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందన్నారు. రోజువారీ తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెట్లను పెంచి పర్యావరణాన్ని రక్షించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్ట్ అధికారి నాగేశ్వర్‌రావు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కొండాపూర్, జనవరి 2 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏ కోర్సు (2025-27) అడ్మిషన్లను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి గల విద్యార్థులు జనవరి 15 లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐఐఎం కోల్‌కతా ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాట్ -2024లో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

163 అమలు

సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాల ఎంపిక కోసం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో సీడీపీవో ఉద్యోగాల కోసం సీబీఆర్‌టీ పరీక్ష, 6, 7 తేదీల్లో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్) గ్రేడ్-1 కోసం పరీక్షలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ఎస్ 163 (సీఆర్‌పీసీ 144) అమలులో ఉంటుందని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షలు జరిగే తేదీల్లో ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.